క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం పట్టణంలోని సుల్తానాబాద్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సుందరయ్య నగర్, ఆలపాటి నగర్ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలోని ముఖ్య కూడలిలు, డివైడర్స్, ప్రభుత్వ భవనాలపై ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెనాలి పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అనధికారికంగా వాటిని ఇప్పటి వరకు ఏర్పాటు చేసినట్లు చేస్తూ వచ్చారని తెలిపారు. వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు అనుమతి లేకుండా వాటిని ఏర్పాటు చేయవద్దన్నారు.

లీగల్ మెట్రాలజీ ఉన్నతాధికారి విమల్‌బాబుకు డాక్టరేట్



తెనాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలరుగా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆ విభాగానికి అధిపతిగా ఉన్న డాక్టర్ విమల్‌బాబు శనివారం విజ్ఞాన్ యూనివర్శిటీ 12వ స్నాతకోత్సవంలో డాక్టరేట్‌ను స్వీకరించారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో 'ఫ్రాడలెంట్ ప్రాసెస్ డిటెక్షన్ యూజింగ్ కంప్యుటేషన్ టెక్నిక్స్ ఇన్ ఫ్యూయల్ అడల్ట్రేషన్' అనే అంశంపై చేసిన పరిశోధన థీసిస్ ఉత్తమంగా ఎంపికైంది. వీరు 14 జాతీయ/ అంతర్జాతీయ సదస్సుల్లో పత్రసమర్పణ చేశారు. పేటెంట్‌ను సాధించారు. 'ఇంటెలిజెంట్ హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్' గ్రూపు సభ్యుడుగానూ ఉన్నారు.

నెహ్రూనికేతన్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



తెనాలిఅర్బన్: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణతో, విద్యార్థినీలు గోపికలు, రాధ వేషధారణతో పాఠశాలకు వచ్చి అందరిని అలరించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివాజీ చౌక్‌లో ఆక్రమణలు తొలగింపు



తెనాలిఅర్బన్: శివాజీచౌక్‌లోని అక్రమణలను మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. మసీదు ముందు, శివాజీ బొమ్మ సమీపంలో అనేక మంది మున్సిపల్ స్థలాన్ని అక్రమించారు.వాటిలో కొందరూ భారీ ఫ్లెక్సీలను, మరికొందూ ఇనుప దుకాణాలను ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు ఇవ్వడంతో వాటిని తొలగించినట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకర్ తెలిపారు.

తూతూ మంత్రంగా గ్రామ సభలు

తాడికొండ: కూటమి ప్రభుత్వం తూతూమంత్రంగా గ్రామ సభలు నిర్వహించి, గ్రామ సభలు గురించి గొప్పలు చెప్పుకుంటున్నారని, మాజీ మంత్రి మేకతోటి సుచరిత విమర్శించారు. కొన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచులను ప్రొటోకాల్ ప్రకారం పిలువలేదన్నారు. కూటమి నాయకులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మేము చెప్పినట్లు వినాలి, లేదంటే ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసి బదిలీ చేయిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

మండల్ ప్రతిపాదనలకు కుల గణనే కీలకం

మంగళగిరి: ఓబీసీల పితామహుడు బీపీ మండల్ సిఫార్సులు అమలు పరచాలన్నా కులగణనే కీలకమని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో 3,743 కులాలుగా 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు మూడు సిఫార్సులు తప్ప నివేదిక సమర్పించి మూడు దశాబ్దలైనా మండల్ సిఫార్సులను అమలు జరపడం లేదన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని మా భవిష్యత్ కోసం కష్టపడి వైద్య విద్య చదివిస్తున్నారు. దూరమైన పీజీలలో చేరి చదువుతున్నాం. కానీ కోల్‌కతా లాంటి ఘటనలు మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయి. విద్యపై ప్రభావం చూపుతాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలో ఆత్మవిశ్వాసం నింపాలి.

-ఐ.నిఖితా రెడ్డి, ఎయిమ్స్ విద్యార్థిని



ఆందోళనకు గురిచేసింది



కోల్‌కతాలో చోటుచేసుకున్న ఘటనతో వైద్య విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. ఘటనను వైద్య విద్యార్థినులు మాత్రమే కాకుండా మహిళా లోకంపై దాడి. దేశంలోని అందరూ ఖండించాలి. ప్రభుత్వం ఉదాసీనత పాటించకుండా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. లేకుంటే మహిళలకు మానసిక ధైర్యం కోల్పోయే ప్రమాదం ఉంది.

ఎం.అంజని, విద్యార్థిని

ట్రాఫిక్ దిగ్బంధం వీడేదెన్నడో!?

- ట్రాఫిక్ ఎస్‌ఐ లేని వైనం
- వాహన రద్దీని క్రమబద్ధీకరించడంలో చేతులెత్తేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది



గాంధీచౌక్‌లో ట్రాఫిక్ రద్దీ

తెనాలిరూరల్: రోజు రోజుకీ పెరుగుతున్న వాహనాల వినియోగంతో తెనాలిలో ట్రాఫిక్ కష్టాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. పశ్చిమ డెల్టాలో ప్రధానమైన పట్టణం కావడంతో పరిసర గ్రామాల నుంచి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కారణంగా పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. గతంలో మార్కెట్ వంతెన వద్ద స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు మూడు రోజులు పాటు చేపట్టిన సర్వేలో మార్కెట్ వంతెన వద్ద తెనాలి–గుంటూరు రోడ్డు, తెనాలి–చందోలు రహదారిలో గంటకు 1400 నుంచి 1600 మంది పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారని తేలింది. ఇక వాహనదారుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక్కడి మెయిన్ రోడ్డు, బోస్ రోడ్డు, పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డు, నెహ్రూ రోడ్డు, ఆంధ్రా బ్రిడ్జి నుంచి గంగానమ్మ పేటకు వెళ్లే రోడ్డు, ఓవర్‌బ్రిడ్జి డౌన్ ఎప్పుడూ వాహనాల రద్దీతో ఉంటుంది. పెరుగుతున్న జనాభా, వాహనాల వినియోగంకు తగ్గట్టు రోడ్ల విస్తరణ జరుగకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. మంగళగిరి నుంచి చినరావూరు పార్కు వరకు వచ్చే ఆర్టీసీ బస్సులు కొత్త వంతెన వద్దమలుపు తిరిగే సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్ల విస్తరణతో పాటు కొత్త వంతెనను విస్తరించడం లేదా సమాంతరంగా మరో వంతెనను నిర్మిస్తే కొంత వరకు వాహనదారుల ఇబ్బందులు తీరతాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ జాడేదీ?

2009లో సబ్‌కలెక్టర్/ఆర్డీవో అధ్యక్షతన ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పట్టణ సీఐ, టౌన్‌ప్లానింగ్ అధికారి, ఆర్టీసీ డీఎం, ట్రాఫిక్ ఎస్‌ఐ ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ డీఈలు, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా తీర్మానించారు. ట్రాఫిక్ పరిశీలన పేరిట నాలుగైదుసార్లు పట్టణంలో పర్యటించి హడావిడి చేసిన అడ్వయిజరీ కమిటీ సభ్యులు తరువాత దాని గురించి పట్టించుకోకపోవడం విశేషం. అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించి ఏళ్లు గడుస్తున్నాయి.

ట్రాఫిక్ ఎస్‌ఐని కేటాయించని అధికారులు

పట్టణంలో కీలకమైన ట్రాఫిక్ విభాగంలో 30 నుంచి 35 మంది వరకు సిబ్బంది అవసరం ఉంది. అయితే ప్రస్తుతం కేవలం 10 మంది వరకు మాత్రమే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు బందోబస్తు డ్యూటీలు ఇక్కడి సిబ్బందికి నిత్యకృత్యమయ్యాయి. ఎన్నికలకు ముందు శివరామయ్య ట్రాఫిక్ ఎస్‌ఐగా చేస్తూ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి తగిన సిబ్బందిని నియమిస్తే సమస్య పరిష్కరించేందుకు కొంత వరకు వెసులుబాటు కలుగుతుంది.

చర్యలు తీసుకుంటున్నాం



తెనాలిలోని ప్రధాన సమస్యల్లో ఇక్కడి ట్రాఫిక్ ఒకటి. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది సంఖ్యను పెంచి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. త్వరలో జరుగనున్న పోలీసు అధికారుల బదిలీల్లో ట్రాఫిక్ ఎస్‌ఐను కేటాయించే అవకాశం ఉంది.

– బి.జనార్దనరావు, డీఎస్పీ

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ షరీఫ్



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు శ్రీధర్, అబ్దుల్‌షరీఫ్

తెనాలిరూరల్: సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ షరీఫ్ న్యాయవాదులను కోరారు. తెనాలి కోర్టు సముదాయంలో శనివారం న్యాయవాదులతో సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీపడితే కోర్టు ఫీజులు సైతం వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. మరో సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. రాజశేఖర్ పోలీసుల అధికారులతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నింటినీ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. ఆయా సమావేశాల్లో బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు, చుండూరు సీఐ ఎం. శ్రీనివాస రావు, తెనాలి రూరల్, చుండూరు. కొల్లూరు, అమృతలూరు, వేమూరు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి వైకుంఠపురంలో ప్రతిష్టా మహోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన చైర్మన్ కుంభం సాయిబాబు పక్కన ఈవో తిమ్మానాయుడు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26వ తేదీ నుంచి కళాన్యాస పూర్వక శిఖర ప్రతిష్టా మహాసంప్రోక్షణ ఉత్సవాలు జరగనున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా కొండరాతితో నిర్మించిన శ్రీస్వామి, అమ్మవార్ల విమాన గోపురాల శిఖర ప్రతిష్ట, జీవ ధ్వజ శిఖర ప్రతిష్టతోపాటు శ్రీస్వామి, అమ్మవారు, శ్రీభవరహాస్వామికి కళాన్యాస మహోత్సవం ఉంటాయన్నారు. శ్రీహనుమత్ లక్ష్మణ సీతారామ స్వామి, రుక్మిణీసహిత శ్రీకృష్ణస్వామి వార్ల ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ, నూతనంగా నిర్మించిన శ్రీహనుమంత్ మందిరంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి మందిరంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి శిలవిగ్రహ ప్రతిష్ట వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీ విఖనస మహర్షి ప్రతిపాదించిన వైఖానస ఆగమోక్త ప్రకారం త్రయాహ్నిక దీక్షతో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. భక్తుల సహాయసహకారాలతో దేవాలయం నవీకరణ జరిగి, మహాసంప్రోక్షణ జరుగుతున్నందున భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించి, స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు కురగంటి సునీత–రవికంర్, బొద్దులూరి సరస్వతి–నాగేశ్వరరావు, ముంతా ప్రసాద్, దేవరకొండ వెంకటరమణ–శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవి కుమార్ పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీని తిలకించిన విద్యార్థులు



శిల్పాలను తిలకిస్తున్న విద్యార్థులు

తెనాలి: రూరల్ మండలంలోని ఆటోనగర్ శివారులో నూతనంగా ఏర్పాటుచేసిన కాటూరి ఆర్ట్ గ్యాలరీని శనివారం పట్టణంలోని రెయిన్‌బో స్కూలు విద్యార్థులు సందర్శించారు. స్థానిక శిల్పకళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు వివిధ ప్రక్రియల్లో శిల్పకళారూపాలను తీర్చిదిద్దుతున్నారు. వీరు రూపొందించిన జాతినేతల నుంచి రాజకీయ నేతలు, సాహితీవేత్తలకు చెందిన 150 శిల్పాలతో కూడిన ఆర్ట్ గ్యాలరీని ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్ట్ గ్యాలరీని స్థానికులు తిలకించాల్సిందిగా శిల్పులు ఇచ్చిన పిలుపుకు రెయిన్‌బో స్కూలు యాజమాన్యం దొడ్డక ఆదినారాయణ స్పందించారు. పాఠశాల విద్యార్థులు అక్కడి శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. రెయిన్‌బో స్కూలు యాజమాన్యానికి కాటూరి కుటుంబం ధన్యవాదాలను తెలియజేసింది.

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలిరూరల్: జులై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ న్యాయవాది ఖాదర్ హుస్సేన్ అన్నారు. తెనాలి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొత్తపేటలోని మున్సిపల్ పాఠశాలలో న్యాయ విజ్ఞానసదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించేందుకు న్యాయ విజ్ఞానసదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పారాలీగల్ వలంటీర్లు అజ్గర్ అలీ, ఎస్. మొహిద్దీన్ మాట్లాడారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుందరరావు, ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆయుర్వేదానికి పెరిగిన ప్రాధాన్యం

ప్రొఫెసర్ కూరపాటి శ్రీనివాస్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

తాడేపల్లిరూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో భారతీయ జ్ఞాన పరంపరను ప్రోత్సహించడంలో భాగంగా కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం, ఆంధ్రప్రదేశ్ విజ్ఞాన భారతి సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూరపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది భారతీయ ప్రాచీన వైద్యవిధానమని అన్నారు. క్రీ.శ. 2వ శతాబ్దంలో ప్రారంభమైన ఆయుర్వేదం చికిత్స ద్వారా ఎంత మొండి రోగాలకైనా సులువుగా చికిత్స చేయవచ్చని అన్నారు. ఆయుర్వేదం పట్ల సమాజంలో ఉన్న అపోహలు నిజం కాదన్నారు. ఆహార నియమాలు సరిగ్గా పాటిస్తే సగం రోగాలు నయం చేయవచ్చని అన్నారు. సదస్సు కన్వీనర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం పుణ్యమా అని చిన్న వయసులోనే పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్లు డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు క్యాన్సర్‌కు కారకం

కేఎల్‌యూ ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు



వడ్డేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కేఎల్‌యూ మేనేజ్‌మెంట్ హ్యూమానిటీ సైన్స్(ఎంహెచ్ఎస్) డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం యూనివర్సిటీ ఎంబీఏ విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీని వడ్డేశ్వరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా చుట్ట, బీడీ, సిగరెట్, పాన్‌పరాగ్, ఖైనీ వంటి పొగాకు ఉత్పత్తులకు బానిసలు అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని వినియోగించడం వలన నోరు, గొంతు, ఊపిరి తిత్తులు తదితర అవయవాలకు క్యాన్సర్ సోకి అర్ధాంతరంగా జీవితాన్ని ముగించాల్సి వస్తోందన్నారు. కేఎల్‌యూ బిజినెస్ స్కూల్ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకం, పొగాకు బానిసలు కాకుండా యువత తమ జీవితాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం పొగాకు వద్దు అంటూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంబీఏ ఉప విభాగాధిపతి డాక్టర్ బాజాలీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేవీపీ రాజు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోండి



తెనాలిఅర్బన్: విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా డెవలప్ చేసుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఈవో నన్నపనేని భాస్కర్ పేర్కొన్నారు. ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు కళాశాల నుంచి కోర్సు పూర్తి చేసుకుని బయటకు వెళ్ళే లోపు ఉద్యోగాలు సాధించుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ వీబీఎన్ అజయ్, అకాడమిక్ కో–ఆర్డినేటర్ వై.సురేష్, వీఎస్సార్ అండ్ ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, పలువురు హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



తాడేపల్లిరూరల్: రైతులందరూ తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని దుగ్గిరాల వ్యవసాయ అధికారిణి పి.శిరీష అన్నారు. శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు ద్వారా పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ పథకం, ధాన్యం కొనుగోలు మొదలైనవి వర్తిస్తాయని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు శిరీష, లావణ్య పాల్గొన్నారు.

నేడు దాశరథి సినీ సంగీత విభావరి



మాట్లాడుతున్న సాయి లక్కరాజు

తెనాలి: నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా కలాన్ని దూసి జైలుజీవితం అనుభవించి తర్వాత సినీకవిగా రాణించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి దాశరథి కృష్ణమాచార్యులు సినీ సంగీత విభావరిని తెనాలిలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో దాశరథి శతజయంతి సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు శనివారం సాయంత్రం చెప్పారు.

స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరిగే సంగీత విభావరిలో కత్తి సౌజన్య (తెనాలి), సత్యవర్ధన్ (హైదరాబాద్)లు, దాశరథి రాసిన ఆణిముత్యాలనదగ్గ 'ఏ దివిలో విరిసిన పారిజాతమో', 'ఖుషీఖుషీగా నవ్వుతూ' వంటి పాటలను ఆలపిస్తారని వివరించారు. సంగీతాభిమానులు జయప్రదం చేయాలని కోరారు. వీరితో విశ్రాంత తపాల అధికారి తిరుమలరావు, బ్యాంక్ అధికారి రవిమోహన్ ఉన్నారు.

రేపు ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన సింహగౌరదాస్

తెనాలి: స్థానిక నాజరుపేటలోని ఇస్కాన్ మందిరంలో ఈనెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహించనున్నారు. ఉత్సవాల ఆహ్వానపత్రికను నిర్వాహకులు సింహగౌరదాస్ శనివారం మందిరంలో ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. ఉదయం 4.30 గంటలకు మంగళహారతితో ప్రారంభమై, గురుపూజ, విశేష అలంకరణ దర్శనం, శ్రీమద్ భాగవతం ప్రవచనం, కలశ అభిషేకాలు, ఉట్టి ఉత్సవాలు, హారతి జరుగుతాయని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో కీర్తనలు, సాహిత్య కార్యక్రమాలు, వైష్ణవ భజనలు, మహాశంకాభిషేకం, భోగనివేదన, మహాహారతులు ఉంటాయన్నారు. 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

పత్తిపంటను పరిశీలించిన లాం ఫాం శాస్త్రవేత్తలు



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో రైతు అలవల కోటేశ్వరరావు సాగు చేస్తున్న పత్తి పంటను లాం ఫాం శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ప్రధాన పంట తో పాటు కంది, చుట్టూ సజ్జ అంతర్ పంటగా బెండ అలసంద, చెట్టు చిక్కుడు, గోరు చిక్కుడు పంటలను కొంత భాగంలో గమనించారు. గులాబీ రంగు పురుగు ఉనికి లేకపోవటం, పత్తి పంట ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. రైతు పాటించిన పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. పొలంలో పసుపు రంగు అట్టలు, లింగాకర్షక బుట్టలలో పురుగుల ఉనికి పరిశీలించారు. ఏడీఆర్ దుర్గాప్రసాద్, ఇతర శాస్త్రవేత్తలు పరిశీలించారు. డీఏఓ నున్నా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు అలవల కోటేశ్వరరావు పత్తిని ఏ గ్రేడ్ మోడల్ పంటగా గుర్తించినట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెల్లడించారు. సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు పతకాలు



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీలలో చంద్రిక ప్రతిభ చూపింది. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ కోల్‌కతాలో నిర్వహిస్తున్న సీనియర్ నేషనల్ పోటీలు నిర్వహించారు. శనివారం పోటీలతో మహిళల 84 కేజీల విభాగంలో మంగళగిరి నుంచి బొల్లినేని చంద్రిక ఓవరాల్ బ్రాంజ్ మెడల్ ఇంటర్‌స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరావు, కోచ్ షేక్ సంధానిలు తెలిపారు. స్క్వాట్ 250 కేజీలలో సిల్వర్ మెడల్ బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కేజీలు బ్రాంజ్ మెడల్, ఓవరాల్ 547 కేజీలు బ్రాంజ్ మెడల్ ఇంటర్ స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన చంద్రికను అసోషియేషన్ ప్రతినిధులు అభినందించారు.